క్లుప్తంగా

సేవాలాల్ సేన కార్యదర్శిగా లక్పతినాయక్


లక్పతినాయక్, పత్యానాయక్‌లను సన్మానించిన సేవాలాల్ సేన నాయకులు

కడ్తాల్: సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శిగా మండల పరిధిలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన జర్పుల లక్పతినాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నవేములోని బావితండాకు చెందిన పత్యానాయక్ నియమితులయ్యారు. మంగళవారం జనగాం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంకల్పసభలో సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ వారికి నియామక పత్రం అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లక్పతినాయక్, పత్యానాయక్‌లను పలువురు సేవాలాల్ సేన నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రఘురాంరాథోడ్, నరేశ్ నాయక్, భీంలాల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య తప్పనిసరి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం తప్పనిసరిగా అందజేయాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూఆర్‌ఐఈఎస్‌ను సందర్శించారు. పాఠశాలలో బియ్యం, కూరగాయలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, శుభ్రంగా ఉన్నాయా? లేదా? తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించాలని, ఈ విషయంలో రాజీపడొద్దన్నారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యం ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతివిద్యార్థిపై ప్రత్యేక దృష్టి అవసరం

ఎంఈఓ సర్దార్ నాయక్


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి ఉంచి చదివించాలని, దీంతో తప్పనిసరిగా ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎంఈఓ సర్దార్ నాయక్ పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏ రోజు పాఠాలు ఆ రోజే చదువుకోవాలన్నారు. అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులచే నివృత్తి చేయించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రేఖ, ఉపాధ్యాయినులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించండి

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రామకృష్ణ


ఎల్మినేడు ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు, తులేకలాన్, కప్పపహాడ్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లోని ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. కేజీబీవీ ఉద్యోగులకు బేసిక్ పేతో కూడిన వేతనం ఇవ్వాలన్నారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. వెంకటేష్, నర్సింహా, జహీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు గోస..!

రుణమాఫీ తెచ్చిన తంటా!

- రేషన్ కార్డు లింకుతో వర్తించని మాఫీ
- 19,219 మంది రైతులకు గాను కేవలం 3,572 మందికే..
- రైతువేదికలో దరఖాస్తులు ఇస్తున్న కర్షకులు
- సర్వే చేసి పరిశీలిస్తామని బదులిస్తున్న వ్యవసాయ శాఖ
- ఆందోళనలో అన్నదాతలు


రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

యాచారం: రైతాంగాన్ని రుణమాఫీ గోస వెంటాడుతోంది. రూ.2 లక్షల్లోపు రుణాలు మొత్తం మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి సర్కార్ హామీ ఇచ్చింది. అప్పులు ఇచ్చిన బ్యాంకుల వద్దకు వెళ్లి వివరాలు అడిగితే మాత్రం పొంతన లేని నిబంధనల వల్ల రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి, 2023 డిసెంబర్ 9, వరకూ రుణాలు పొందిన రైతులందరికీ (కుటుంబంతో కలిపి) రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన 19,219 మంది రైతులు ఉన్నారు. అందులో 12,500 మందికి పైగా యాచారం పీఏసీఎస్‌తో పాటు యాచారం, మీరాఖాన్‌పేట, మాల్, నందివనపర్తి గ్రామాల్లోని ఎస్‌బీఐ, మాల్‌లోని యూనియన్ బ్యాంకు, నక్కర్తమేడిపల్లిలోని ఇండియన్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. ఈ రైతులంతా 2014 నుంచి రుణాలు పొంది, కొందరు ప్రతి యేటా రెన్యువల్ చేసుకోకపోవడం, మరికొందరు ఎన్నికలు వస్తే అధికారంలోకొచ్చే ప్రభుత్వాలు మాఫీ చేస్తాయనే ఆశతో రెన్యువల్ కూడా చేసేకోలేదు. ఆయా గ్రామాల్లోని బ్యాంకు సిబ్బంది రెన్యువల్ లేదా తీసుకున్న అప్పు చెల్లించమంటూ పలుమార్లు గ్రామసభలు పెట్టి చైతన్య పరిచిన వారిలో చలనం లేదు. రుణాలు కట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రూ. 2లక్షల వరకూ మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు గతంలో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోలేదు.

3,572 మందికే మాఫీ..

యాచారం మండలంలోని 24 గ్రామాల్లో మూడు విడతల్లో కేవలం 3,572 మందికే మాఫీ వర్తించింది. 3,572 మంది రైతులకు రూ. 27,80,49,914లు మాఫీ చేశారు. మండలంలోని 24 గ్రామాల్లో 12,500 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. వివిధ బ్యాంకుల్లో 5 వేల మందికి పైగా రూ. లక్షన్నర లోపు రుణాలు పొందిన వారున్నారు. కొన్ని బ్యాంకుల మేనేజర్లు రుణమాఫీ వివరాలు నింబంధనల ప్రకారం ఉన్నతాధికారులకు పంపకపోవడంతో రైతాంగానికి పెద్ద శాపంగా మారింది. యాచారం పీఏసీఎస్‌లో వెయ్యి మందికి పైగా అర్హత కలిగిన రైతులున్నప్పటికీ సరైన నింబంధనలు పాటించకపోవడంతో మాఫీ చేయలేదు. దీంతో వారు నిత్యం పీఏసీఎస్, ఆయా బ్యాంకుల వద్దకు వెళ్తున్నారు. అక్కడ పొంతనలేని నింబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. యాచారం పీఏసీఎస్, యాచారం, మాల్ ఎస్‌బీఐ, నక్కర్తమేడిపల్లి ఇండియన్ బ్యాంకుల్లోని రైతులు రుణమాఫీ కాక పోవడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ దరఖాస్తులు..

రుణమాఫీ కాని రైతులు ఆశతో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ యాచారం రైతువేదికలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఆ కేంద్రంలో 1,063 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. రుణమాఫీ కాని రైతులతో రైతువేదిక నిత్యం కిటకిటలాడుతుంది. రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు లేకపోవడం, బ్యాంకు ఖాతాలో ఒక పేరు ఉండి ఆధార్‌లో మరో పేరు, రేషన్ కార్డు ఉన్నవారికి పట్టాదారు, పాసుపుస్తకాల్లో పేర్లు సక్రమంగా ఉండకపోవడం, ఆధార్ కార్డుల్లో సరైన వివరాలు లేకపోవడంతో మాఫీ వర్తించలేదు. ఇలా పలు నిబంధనలతో రుణమాఫీ కాని రైతులు మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు.

ఇద్దరికీ మాఫీ కాలేదు



నేను, నా భార్య పాసుపుస్తకాలను యాచారం ఎస్‌బీఐలో పెట్టి రూ. మూడున్నర లక్షల పంట రుణం తీసుకున్నాం. కానీ కుటుంబంలో ఒక్కరికే రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని సర్కార్ చెప్పింది. ఇద్దరిలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. యాచారం రైతు వేదికలో అధికారులను అడిగితే సరైన వివరాలు చెప్పడం లేదు.

– గుర్రం రఘుమారెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

హామీ మేరకు చేయాలి



కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి. కానీ రుణమాఫీకి నిబంధనలు పెట్టడంతో మాఫీ సక్రమంగా అమలు కావడంలేదు. యాచారం ఎస్‌బీఐలో రూ. లక్షన్నర రుణం తీసుకున్నాను. మాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే ఏవో నిబంధనలు చెబుతున్నారు. సర్కార్ హామీ ఇచ్చినట్లు రూ.2 లక్షల్లోపు రుణాలు మొత్తం మాఫీ చేయాల్సిందే.

– గౌర నర్సింహ, రైతు చౌదర్‌పల్లి

దరఖాస్తుల ఆధారంగా సర్వే



యాచారం మండలంలోని పలు గ్రామాల నుంచి రుణమాఫీ కాలేదని చాల మంది రైతులు దరఖాస్తులు చేస్తున్నారు. నిత్యం 200 మందికి పైగా వస్తున్నారు. దరఖాస్తులు ఇస్తున్నారు. వాటిని పరిశీలిస్తే రేషన్ కార్డు, ఆధార్ కార్డుల్లో, పట్టాదారు, పాసుపుస్తకాల్లో పేర్ల తప్పుల వల్ల మాఫీ కాలేదని తెలుస్తుంది. దరఖాస్తుల ఆధారంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తాం.

– రవినాథ్, మండల వ్యవసాయాధికారి, యాచారం

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం

- గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా
- రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని, విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవలో పాల్గొనాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. మంగళవారం హన్మానాయక్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో రవీందర్‌రెడ్డి చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రవీందర్‌రెడ్డి అరుణ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గ్రామంలో మొట్టమొదటగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి 30 సంవత్సరాలుగా రవీందర్ రెడ్డి అనేక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారన్నారు. వారందించిన సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. విధినిర్వహణలో కష్టపడే ఉపాధ్యాయులకు సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జంగారెడ్డి, చేగూరి వెంకటేశ్, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, లక్ష్మయ్య, కేశవులు, రాజేందర్‌రెడ్డి, ఆంజనేయులు, పాండు, రామకృష్ణ, చందోజీ, సత్యం యాదవ్, జహంగీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో లోక కల్యాణార్థం లలితాపరమేశ్వరి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు స్త్రీ శక్తి లలితాంబిక బృందం, సాయి మందిర దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. 28న దేవాలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, దీక్షాధారణ, శోడశ స్తంభ పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, కలశస్థాపన, అర్చన, హారతి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి, నవగ్రహ యంత్ర మూల మంత్రహోవనం, జలాధివాసం 29న మండపారాధన, హోమాలు, జలాధివాస హోమం, మంత్ర పుష్పం, చండిహోమం, ధాన్యాధివాసం, ప్రదోషకాల పూజ, హారతి, 30న స్థాపిత దేవతా మండపారాధన, మాల మంత్ర హోమాలు, అధివాస హోమాలు, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, దిక్పాలక బలి, మహాపూర్ణాహూతి, అవబృత స్నానం ఆశీర్వచనములు, అనంతరం రాత్రికి అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం ఆలయం వద్ద ఏర్పాట్లను మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, జంగారెడ్డి, ఎలికంటి జ్ఞాన ప్రసూనాంబ శర్మ తదితరులు పరిశీలించారు.

విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

పరిష్కరించాలని మేడిగడ్డ తండావాసుల వేడుకోలు


విద్యుత్ సమస్యను వివరిస్తున్న రవీందర్‌నాయక్, తండావాసులు

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డ తండాలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని రవీందర్‌నాయక్ కోరారు. మూడు రోజులుగా తండాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం ఏఈ సీతారాముతో వేడుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తండాలో అప్పుడప్పుడు విద్యుత్ వస్తూ, పోతుందని అరగంటకు మించి ఉండటం లేదని వారు ఏఈ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో మేడిగడ్డ తండాకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈ సీతారాం మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూస్తామని, ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, శంకర్ నాయక్, సేవ్యనాయక్, రమేశ్‌నాయక్, కృష్ణనాయక్, రమ్మిరాథోడ్, హరిలాల్‌నాయక్, రమేశ్‌నాయక్, జయరాంనాయక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

తలకొండపల్లి: చౌదర్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేష్, డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 216 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్, తదితర రోగాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ అఖిల్ మాట్లాడుతూ వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతు నొప్పి, కళ్ల మంటలు, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దన్నారు. తక్షణమే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పెంటమ్మ, భగ్‌వాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రయ్య, అశోక్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, శ్రీను, మల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసురెడ్డి, కిరణ్, రామ్‌రెడ్డి, జంగయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజల మనిషి అని, అతనిపై చేసే అసత్య ప్రచారాలు మానుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రఘురాములు పేర్కొన్నారు. మంగళవారం చుక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయంగా ఎమ్మెల్యేను ఎదుర్కొలేకనే కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మా సత్యం మతిభ్రమించి, అనాలోచితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎదుటి వ్యక్తిని విమర్శించే ముందు తన స్థాయి ఏమిటో తెలుసుకొని మాట్లాడాలన్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో వారే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రమేష్, యాదయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, రేణిరెడ్డి, ఏమిరెడ్డి రంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగునకు మగ్గం శిక్షణ


మాట్లాడుతున్న సక్రియనాయక్

ఇబ్రహీంపట్నం: జీవనోపాధి పెంపునకు ఉపాధి కూలీలకు మగ్గం శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీడీ సక్రియ నాయక్ తెలిపారు. ముకునూర్ గ్రామంలో మంగళవారం మొక్కల ప్లాంటేషన్‌ను సందర్శించి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. వంద రోజుల ఉపాధి హామీ పనులను పూర్తి చేసుకున్న మహిళలకు 'ఉన్నతి' ద్వారా ఇబ్రహీంపట్నంలో మగ్గం శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- సీఐ శివప్రసాద్
- జోనల్ స్థాయి ఫ్రీడమ్ కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీ ప్రారంభించిన సీఐ శివప్రసాద్‌ను సన్మానించిన నిర్వాహకులు

కడ్తాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫార్చున్ బటర్‌ఫ్లై సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీని, ఫార్చున్ బటర్ ఫ్లైసిటీ సీనియర్ సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్‌నాంపల్లితో కలిసి సీఐ శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల్లో ప్రభుత్వం అందజేస్తున్న వసతులను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. ఆటలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా క్రింద తగిన ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. అనంతరం క్రీడల జోనల్ సెక్రటరీ భీముడు మాట్లాడుతూ ఈ టోర్నీకి కడ్తాల్, మాడ్గుల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లోని 16 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. బుధవారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జంగయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాబేర్, పీడీలు జ్యోతి, పాండు, ప్రసాద్, రామకృష్ణ, రాంచందర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

వినాయక చవితిని మండల పరిధిలోని గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ శివప్రసాద్ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్లో నాయకులు, మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గణేశ్ విగ్రహాలు పెట్టే నిర్వాహకులు సమాచారం నిమిత్తం ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, ఏఎస్ఐ ప్రసాద్‌జీ, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, బీసీ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, జహంగీర్‌అలీ, సాయిలు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతగా ఆనంద్

మంచాల: నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా నగరంలో మంగళవారం నిర్వహించిన క్రీడోత్సవాల్లో మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె ఆనంద్ చెస్‌లో గెలుపొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా అథారిటీ చైర్మన్ కె శివసేనా రెడ్డి మెమెంటో అందజేశారు. మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఆనంద్ గెలుపొందడం గర్వంగా ఉందని కళాశాల అధ్యాపక బృందం పేర్కొంది.

ఓటర్ జాబితాపై బీఎల్‌ఓలకు అవగాహన

ఇబ్రహీంపట్నం: ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులుంటే సరిచేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవెల్ ఆఫీసర్స్‌కు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, అడ్రస్సుల మార్పులు, చేర్పులను అక్టోబర్ 18 వరకూ పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన తేదీలను బట్టి రెండు శనివారాలు, రెండు ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు.

ఘనంగా బోనాలు


తలకొండపల్లి: వెల్జాల్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు, భక్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో గంగాదేవి బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం నాగులమ్మ చెరువులోని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కడ్తాల్: అన్మాస్‌పల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహిళ భక్తులు, బోనంతో ప్రధాన వీధుల గుండా ఉరేగింపులో పాల్గొన్నారు.

తలకొండపల్లి: వెల్జాల్‌లో ఈదమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. బోనంతో నైవేద్యం అమ్మవారికి సమర్పించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ అంబాజి, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, విష్ణువర్ధన్, నరేందర్‌గౌడ్, శేఖర్, కృష్ణ, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతులు

నీటిసరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం: మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతులతో నీటి సరాఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 15 రోజుల నుంచి మంచినీటి సరాఫరాకు ఆటంకం ఏర్పడింది. గౌరిదేవి పల్లి 2500 కేడబ్లూ పంప్‌హౌజ్ మెయింటనెన్స్‌లో భాగంగా 16, 17 తేదీల్లో మంచినీటి సరఫరా ఉండదని ప్రకటించారు. ఈ క్రమంలో కల్వకుర్తి రా వాటర్ పైపు లైన్ లీకేజీతో 20వ తేదీ వరకు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. మధ్యలో ఒక్కరోజు మినహా ఇబ్రహీంపట్నంలో మంగళవారం వరకు నీటి సరఫరా చేయకపోవడంతో ప్రజలు అవస్థలకు గురౌతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి నీటి సరఫరా సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.